క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబానికి పంపిణీ చేస్తున్న నిత్యావసరాలు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు దాతలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండలంలోని కుడుపూరు గ్రామానికి చెందిన మందపల్లి రాజు, శివల గ్రామానికి చెందిన మోర్త ప్రశాంత్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరఫున బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు చిర్రా రాజ్‌కుమార్, ముంగి రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ శీలం వారి సావరం, ముచ్చిమిల్లి ఫీడర్ అత్యవసర మరమ్మతుల కారణంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని శీలం వారి సావరం, వైఎస్సార్ నగర్, రాజబాబు నగర్, గణేష్ నగర్, రాజగోపాల్ సెంటర్, ద్రాక్షారామ రోడ్డు, ఆర్టోస్ ఫ్యాక్టరీ, బీర్ ఫ్యాక్టరీ, వెల్ల వాటర్ వర్క్స్', సాయి నగర్, శాంతినగర్, డీఎస్పీ ఆఫీస్, ఫైర్ స్టేషన్, బ్రాడీపేట, శ్రీరాంపేట, గంగుమళ్ల వారి వీధి, వాడపల్లి వారి వీధి, పెట్రోల్ బంక్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఈఈ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

రామచంద్రపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఇంకా ఏ కళాశాలలో చేరని ఆసక్తి గల విద్యార్థులు వారి విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 12వ తేదీలోగా కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కళాశాలలోని బీఎస్సీ కోర్సుల్లో ఆక్వా కల్చర్–మేజర్, కెమిస్ట్రీ మేజర్, మ్యాథమెటిక్స్ మేజర్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఏలో స్పెషల్ తెలుగు, ఎకనామిక్స్ వంటి బ్రాంచ్‌లున్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలను 8885349991 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

శిక్షణతో వృత్తి నైపుణ్యం



ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ

కాజులూరు: ఏ వ్యవస్థలోనైనా శిక్షణతో వృత్తి నైపుణ్యం పొంది చేస్తున్న పని మరింత సమర్థవంతంగా చేయగలుగుతామని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో రెండు రోజుల పాటు జరుగనున్న పంచాయతీ పాలకవర్గ సభ్యుల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీఓ రాంబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పాలకవర్గ సభ్యులదే కీలకపాత్ర అని అన్నారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న మెళకువలతో ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్నారు. శిక్షణ పొందిన సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఉప సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు



రామచంద్రపురం

రాజగోపాల్	:	శ్వాగ్
కిషోర్	:	దక్షిణ
శ్రీసూర్య	:	దేవర

ద్రాక్షారామ

శ్రీలక్ష్మి	:	సత్యం సుందరం
శ్రీసూర్య	:	దేవర

ఈ లక్ చాలా కాస్ట్‌లీ గురూ..!

- లాటరీ తగలాలంటే రూ.2 లక్షల చేతి చమురు వదలాల్సిందే
- క్లస్టర్‌లో 33 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్
- దరఖాస్తుల స్వీకరణకు నేడు తుది గడువు
- ఈ నెల 11న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు
- ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 251 దరఖాస్తులు



మద్యం సీసాలు

రాయవరం: ఇప్పటి వరకూ ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం షాపులు నిర్వహిస్తుండగా, ఇకపై ప్రైవేట్ వ్యక్తుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతాయి. ఇందుకోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన మద్యం పాలసీ ప్రకారం.. క్లస్టర్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటుగా, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో 33 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండేళ్ల కాల పరిమితికి మద్యం నూతన పాలసీ విధివిధానాలు ఖరారు చేశారు. మద్యం షాపులను దక్కించుకోవడం ద్వారా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు సన్నద్ధం అవుతున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ దరఖాస్తుకు తుది గడువు.

కాస్ట్‌లీ లక్

సాధారణంగా లాటరీలు అమలు చేసే చోట లాటరీ టికెట్‌ను రూ.10 నుంచి రూ.100 వరకూ వెచ్చించి కొనుగోలు చేస్తారు. అదృష్టం బాగుంటే రూ.వేలల్లో లేదా రూ.లక్షల్లో డబ్బు వస్తుంది. ఇప్పుడు మద్యం షాపుల లైసెన్స్ పొందడానికి కూడా అలాంటి లాటరీ విధానమే అమలవుతోంది. మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా డ్రా విధానం(లాటరీ)లో షాపు వచ్చే అవకాశముంది. అయితే ఇక్కడ దరఖాస్తు ధర రూ.2 లక్షలు. షాపు పొందాలనుకునే వారు రూ.2 లక్షలు ఖర్చు పెట్టి దరఖాస్తు చేయాలి. డ్రా విధానంలో షాపు రాకుంటే మాత్రం రూ.2 లక్షల చేతి చమురు వదిలించుకోవాల్సిందే. ఒక విధంగా ఇది ఈ లక్ చాలా కాస్ట్‌లీ గురూ అన్నట్టుగా ఉందని పలువురు దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

మూడు శ్లాబులుగా ఫీజుల నిర్ధారణ

గతంలో మద్యం దుకాణాలను వార్డులు/గ్రామాల వారీగా ఏర్పాటు చేయగా, 2019 నుంచి మండలం యూనిట్‌గా ఏర్పాటు చేశారు. జనాభా ప్రాతిపదికగా మూడు శ్లాబులుగా ఫీజులను నిర్ణయించారు. 10వేల లోపు జనాభా ఉంటే రూ.50 లక్షలు, 10 నుంచి 50 వేల లోపు ఉంటే రూ.55 లక్షలు, 50 వేల నుంచి ఐదు లక్షల జనాభా వరకూ రూ.65 లక్షలు, ఐదు లక్షల పైబడి జనాభా ఉన్న చోట రూ.85 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తు ఫీజును మాత్రం రూ.2 లక్షలుగా నిర్ణయించారు.పూర్తిగా తిరిగి చెల్లించని విధంగా ఈ ఫీజును నిర్ధారించారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి దరఖాస్తుదారుడూ తమ ఆధార్ వివరాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు డీడీతో పాటుగా సబ్మిట్ చేయాలి. దరఖాస్తుదారుడు రాలేని పక్షంలో వారి తరఫున ఎవరైనా వచ్చి సంబంధిత దరఖాస్తుదారుడి వివరాలతో దరఖాస్తు చేసుకునే వీలును కల్పించారు. దరఖాస్తులను సమీప ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సబ్మిట్ చేయాలి. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం మండలాల దరఖాస్తుదారులు రామచంద్రపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులను సబ్మిట్ చేయాలి. ఇక మండపేట, కపిలేశ్వరపురం మండలాల వారు ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్లలో సబ్మిట్ చేయాలి. బుధవారం సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్లో అందజేయాలి. ఈ నెల 11న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అమలాపురంలో డ్రా విధానంలో షాపులు కేటాయిస్తారు. లాటరీ సమయంలో దరఖాస్తుదారుడు రాలేని పక్షంలో సెల్ఫ్ అటెస్టేషన్‌తో వేరే వ్యక్తికి ఆథరైజేషన్ ఇవ్వవచ్చు. డ్రా ద్వారా షాపులు దక్కించుకున్న వారికి 12వ తేదీ నుంచి మద్యం విక్రయించుకునే అవకాశం కల్పించే వీలుంది. ఒక విధంగా చెప్పాలంటే మద్యం వ్యాపారులకు విజయదశమి కానుకగా చెప్పవచ్చు.

క్లస్టర్‌లో ఇదీ పరిస్థితి

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 33 షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రామచంద్రపురం పట్టణంలో ఆరు, రామచంద్రపురం, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలాల్లో నాలుగేసి వంతున, మండపేట మున్సిపాలిటీలో ఐదు, మండపేట రూరల్ మండలంలో ఆరు షాపుల వంతున కేటాయించారు. రామచంద్రపుం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకూ 134 దరఖాస్తులు వచ్చాయి. రాయవరం మండలం నుంచి 36, రామచంద్రపురం మున్సిపాలిటీ నుంచి 10 రామచంద్రపురం మండలం నుంచి 45, కె.గంగవరం మండలం నుంచి 43 దరఖాస్తులు వచ్చాయి. ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండపేట మున్సిపాలిటీకి 39, మండపేట రూరల్ మండలానికి 45, కపిలేశ్వరపురం మండలానికి 33 వంతున దరఖాస్తులు వచ్చాయి.

ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునే వారు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మండలాల నుంచి దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు విధానానికి సంబంధించి అన్ని వివరాలు స్టేషన్‌లో కూడా పొందవచ్చు. దరఖాస్తుకు డీడీ తీసేవారు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పే బిల్ ఎట్ అమలాపురం పేరిట తీయాల్సి ఉంది.

భారీగా పెరిగిన ఫీజులు

2019తో పోలిస్తే లైసెన్స్ ఫీజులు భారీగా పెరిగాయి. 2019లో ఐదు వేల లోపు జనాభా ఉంటే రూ.7.05 లక్షలు, 10 వేల జనాభా వరకూ రూ.8.05 లక్షలు, 25 వేల జనాభా వరకూ రూ.9.25 లక్షలు, 50 వేల వరకూ రూ.10 లక్షలు, మూడు లక్షల వరకూ రూ.11.25 లక్షలు, ఐదు లక్షల జనాభా వరకూ రూ.12.50 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. 2019లో ఆరు స్లాబుల విధానం అమల్లో ఉండగా, ప్రస్తుతం మూడు స్లాబుల విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో దరఖాస్తుతో పాటు అప్లికేషన్ ఫీజు రూ.5వేలు (చలానా), రిజిస్ట్రేషన్ ఫీజు (చలానా రూపంలో) మండలంలో రూ.50 వేలు, మున్సిపాలిటీలో రూ.75 వేలు, కార్పొరేషన్‌లలో రూ.లక్ష, ఈఎండీ (డీడీ రూపంలో) రూ.3లక్షలు (రిఫండబుల్) జత చేయాల్సి ఉండేది. గతంలో ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయించారు. కాని ప్రస్తుత మద్యం విధానాల ప్రకారం ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని షాపులు దక్కించుకుంటే అన్ని షాపులకు లైసెన్స్‌లు జారీ చేస్తారు.

ఎన్ని షాపులు పొందడానికైనా అర్హత



మద్యం షాపులకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వ్యక్తికి ఎన్ని షాపులు పొందడానికైనా అర్హత ఉంటుంది. అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశముందని భావిస్తున్నాం. లాటరీ పద్ధతిలోనే లైసెన్స్ దారులను ఎంపిక చేస్తారు.

– ఐ.డీ.నాగేశ్వరరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, ఆలమూరు

యాప్‌ల నుంచి విముక్తి కల్పించరూ..



వల్లూరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

కపిలేశ్వరపురం: గర్భిణు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించే లక్ష్యంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు విశేషంగా కృషి చేస్తున్నారు. ఆయా విభాగాల వారికి చేదోడు వాదోడుగా ఉండే పనులకు వినియోగించుకోవాల్సిన అంగన్‌వాడీలపై సాంకేతిక భారానికి కూటమి ప్రభుత్వం గురి చేస్తోంది. చేసిన ఒక్కో పనికి ఒక్కో యాప్‌ని నిర్దేశించి వాటిలో వివరాలు నమోదు చేయాలని చెప్పడంతో అసలు పని నాణ్యత తగ్గుతోంది. తమపై యాప్‌ల పనిభారాన్ని తగ్గించాలని కూటమి ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. లబ్ధిదారుల వివరాలు నమోదు చేయడానికి పోషణా ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌లతో పాటు మరికొన్ని యాప్‌లను వినియోగిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందిస్తున్నారు. బాల సంజీవని యాప్ ద్వారా 6 నెలలు నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. వాటితో పాటు అధికారులు మరో ఐదు రకాల రికార్డులు రాయిస్తున్నారు. అందుకు సంబంధించిన రికార్డు పుస్తకాలను ప్రభుత్వం పరిమితంగా ఇస్తోంది. అవి నిండుకున్నాక అంగన్‌వాడీలు సొంత డబ్బులతో రికార్డు పుస్తకాలను కొనాల్సి వస్తోంది. ఏడు నెలలు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అంగన్‌వాడీలపై పనిభారం పలు సమస్యలకు కారణమవుతోంది.

యాప్‌ల నిర్వహణతో యాతన



రోజువారీ కార్యకలాపాల్లో యాప్‌ల నిర్వహణ యాతన కలిగిస్తోంది. అన్ని వివరాలను ఒకే యాప్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలంటూ యూనియన్ తరఫున రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నాం. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

ఎం.జానకిదేవి, అంగన్‌వాడీ నాయకురాలు, వెదురుమూడి

కొనసాగుతున్న పూడికతీత పనులు



కలువపువ్వు సెంటర్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మండపేట: పట్టణంలోని డ్రెయిన్లలో పూడిక తీత పనులు వారం రోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందు కోసం ప్రత్యేకంగా కార్మికులను నియమించారు. మున్సిపాలిటీ పరిధిలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణే లక్ష్యంగా కమిషనర్ రంగారావు అడుగులు వేస్తున్నారు. ఎక్కడెక్కడి డ్రెయిన్లలో మురుగు సక్రమంగా ప్రవహించడం లేదో గుర్తించి ముందుగా అక్కడ పూడిక తీత పనులు పూర్తి చేయిస్తున్నారు. మంగళవారం కలువపువ్వు సెంటర్లోని డ్రెయిన్‌లపై సిమెంట్ బల్లలు తొలగించి పేరుకుపోయిన పూడికను తొలగించారు. ఈ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. తమకు కేటాయించిన ప్రదేశాల్లోని జంబో డస్ట్‌బిన్లలో మాత్రమే షాపుల్లోని వ్యర్థాలను వేయాలని మెయిన్ రోడ్డు, కేపీ రోడ్లలోని వ్యాపారులను ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. తినుబండారాల దుకాణాలు, మిక్చర్ బండ్లు, తోపుడు బండ్ల ద్వారా వచ్చే వ్యర్థాలను పక్కనే ఉన్న డ్రెయిన్లలో వేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బోర్డుల తొలగింపునకు చర్యలు

పట్టణంలోని ప్రధాన రోడ్ల మార్జిన్లలో ఉన్న పనికి రాని బడ్డీలు, బండ్లు, ప్రకటనల బోర్డుల తొలగింపునకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ రంగారావు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు వాటి తొలగింపునకు ఉపక్రమించారు. కేపీ రోడ్డు, సత్యశ్రీ రోడ్డు, ఏడిద రోడ్డు, రాజారత్న రోడ్లలోని మురుగు కాలువలు, డ్రెయిన్‌లపైన ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డుల తొలగింపునకు నాలుగు రోజులుగా చర్యలు చేపట్టారు. అలాగే బస్టాండ్ వద్ద నుంచి రాజారత్న సెంటర్ వరకూ రజక చెరువును ఆనుకుని రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన బడ్డీలను, బోర్డులను కూడా పూర్తిగా తొలగించారు. మంగళవారం రాజారత్న రోడ్డులో మేజర్ డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమణలు కూడా తొలగించాలని కమిషనర్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కాజులూరు: గొల్లపాలెం శివారు ధనలక్ష్మీపేటలో డ్రైనేజీ నిర్మాణానికి నాయకులు శంకుస్థాపన నిర్వహించారు. ధనలక్ష్మీపేట మూడో వీధిలో గ్రామ పంచాయతీ 15వ, ఆర్థిక సంఘం నిదుల నుంచి రూ.ఐదు లక్షలు డ్రైనేజీ నిర్మాణానికి పాలకవర్గం నిధులు మంజూరు చేసింది. మంగళవారం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పాలకవర్గ సభ్యులు పెంటపాటి శ్రీను, అంగర శ్రీను, రేఖపల్లి సత్తిబాబు తదితరులు భూమిపూజ చేసి జేసీబీ సాయంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుబ్బల ఏసురాజు, నున్న కాశి, కోకా హరి, పంచాయతీ కార్యదర్శి కె.రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల వినియోగం అవసరం



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ రంగారావు తదితరులు

రామచంద్రపురం రూరల్: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులను వినియోగించుకోవాలని, తద్వారా దిగుబడి పెరగటంతో పాటుగా పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు కూడా ఎంతో ఉపయోగం ఉంటుందని ఏడీఏ ఏవీ రంగారావు సూచించారు. మండలంలోని కందులపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏవో సత్యప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

జననీ.. జయ శుభకారిణి



రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో మహాలక్ష్మీ రూపంలో విజయదుర్గా అమ్మవారు



మండపేట సైథిల్‌పేట సత్తివారి దుర్గమ్మకు బూరెల అభిషేకం



మహాలక్ష్మీ అవతారంలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ప్రత్యేకాలంకరణలో రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి

- మహాలక్ష్మి అవతారంలో విజయదుర్గా అమ్మవారు
- వాడవాడలా శరన్నవరాత్ర ఉత్సవాలు

రాయవరం: అమ్మలగన్నయమ్మ కనక దుర్గాదేవి రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తోంది. వివిధ ఆకారాల్లో అలంకృతులైన అమ్మవారిని వీక్షించేందుకు.. మనసారా మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఆలయాలకు క్యూ కడుతున్నారు. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో కొలువైన విజయదుర్గ అమ్మ వారు మంగళవారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠబ్రహ్మ శివ, చీమలకొండ వీరావధాని, తోలేటి నాగేంద్రశర్మ అర్చకత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి అన్నపూర్ణా అష్టోత్తరంతో కుంకుమపూజలు, నవగ్రహ హోమం నిర్వహించారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలుచేశారు.అనంతరం భక్తులు గోపూజ చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

శుభాలనిచ్చే శక్తి స్వరూపిణి

విజయదుర్గా అమ్మవారిని మంచి మనస్సుతో కొలిచే వారికి సకల శుభాలు కలుగుతాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు ఉద్బోధించారు.

ధనలక్ష్మిగా దుర్గామాత

మండపేట: శరన్నవ రాత్రులను పురస్కరించుకుని మండపేట పట్టణం, మండలంలోని గ్రామాల్లోనూ విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన దుర్గమ్మ భక్తులతో విశేష పూజలు అందుకుంటున్నారు. స్థానిక సైథిల్‌పేటలోని సత్తి వారి ఇంట వెలసిన కనకదుర్గమ్మకు సత్తిబాబు, వీరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బూరెల అభిషేకం చేశారు. అలాగే గోపూజ, అఖండ దీపారాధన నిర్వహించారు. స్థానిక కలువపువ్వు సెంటర్లోని దుర్గాదేవి ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొండపల్లి వారి వీధిలోని ఆలయంలోని దుర్గమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే ద్వారపూడిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.ఐదుల క్షల విలువైన కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవ శిబిరాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరలోని చేనేత సహకార సంఘం సమీపంలోని విజయదుర్గాంబిక అమ్మవారి ఆలయ పూజారి కొలువుల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో లలితాశక్తి హోమం చేశారు. అంగర, పడమ ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామచంద్రపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం పట్టణంలోని కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుపల్లి గణేష్ శర్మ నేతృత్వంలో అర్చకస్వాములు అమ్మవారిని స్కందమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్


భవానీ మాలధారణ దీక్షలో ఉన్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మహాలక్ష్మి రూపంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ నేతృత్వంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సుభాష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మిదేవిగా మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దేవీ శరన్నవ రాత్ర ఉత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ప్రాంగణంలో మాణిక్యాంబ అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ఆదివారపుపేటలో ఆశ్రమంలో వేంచేసిన అమ్మవారిని, ద్రాక్షారామలోని కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.



అంగర విజయదుర్గాంబిక ఆలయం వద్ద లలితాశక్తి హోమం చేస్తున్న భక్తులు



మహాలక్ష్మీదేవి రూపంలో ద్రాక్షారామ మాణిక్యాంబ



మహాలక్ష్మీదేవి అలంకరణలో ఆదివారపుపేట అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కొత్తూరురోడ్డులో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ